
సాక్షి
ఒడిశా

శుక్రవారం । 22 । మార్చి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు


భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.2,76,351లు, బంగారం 2గ్రాములు, వెండి 28 గ్రాముల 700 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



150 మిలియన్ టన్నుల సరుకు రవాణా

తూర్పు కోస్తా రైల్వే ఖుర్దా రోడ్ డివిజన్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేవలం 347 రోజుల్లో 150 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేసి రికార్డు సృష్టించింది.

-IIలో



న్యూస్‌రీల్

అభ్యర్థుల ఖరారు..?

- కొరాపుట్, నబరంగ్‌పూర్ స్థానాలపై బీజేడీ స్పష్టత



కౌలస్య హిక్క



ప్రదీప్ మజ్జి

కొరాపుట్: ఎట్టకేలకు కొరాపుట్, నబరంగ్‌పూర్ స్థానాల్లో అధికార పార్టీ నుంచి పోటీచేసే అభ్యర్థుల విషయంలో అధిష్టానం సంకేతాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ నివాసంలో కొరాపుట్, నబరంగ్‌పూర్ లోక్‌సభ స్థానాల నాయకులతో ఇటీవల సమీక్ష సమావేశం జరిగిన విషయం తెలిసిందే. ఈ సమావేశాల్లో అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పార్టీ పరిస్థితిని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, 5టీ చైర్మన్ వీకే పాండ్యన్ అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గాలకు వెళ్లి ఎన్నికలకు సిద్ధమవ్వాలని ఆదేశించారు. ముఖ్యంగా పార్టీ ఎంపీ అభ్యర్థులపై సమీక్ష జరిగినట్లు తెలుస్తోంది. కొరాపుట్‌లో గత ఎన్నికల్లో 3,613 ఓట్ల తేడాతో ఓడిపోయిన కౌసల్య హిక్కా కోసం పని చేయాలని, నబరంగ్‌పూర్‌లో ఎస్‌డీసీ సలహాదారుడు ప్రదీప్ మజ్జి కోసం పని చేయాలని కేడర్‌కు ఆదేశించినట్లు సమాచారం. దీంతో ఇద్దరు అభ్యర్థుల సన్నిహిత వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఇరువురు అభ్యర్థులు కూడా తమ ప్రచార పనుల్లో నిమగ్నమయ్యారు. కాగా గత 15 రోజులుగా బీజేడీ–బీజేపీల మధ్య పొత్తు ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. కానీ ఆ విషయంపై ఎటువంటి స్పష్టత ఇరు పార్టీలు ఇవ్వలేదు. దీంతో పోటీ చేయాలనుకునే నాయకులు నిర్లిప్తతకి గురయ్యారు. అయితే మరలా ఈ సమయంలో నాయకులతో సమావేశాలు పార్టీ క్యాడర్‌లో ఉత్సాహం నింపాయి. ఈ సమావేశాలపై బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు నిశితంగా పరిశీలిన జరుపుతున్నాయి.

నకిలీ మద్యం స్వాధీనం




మద్యం బాటిళ్లతో నిందితులు

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రానికి సమీపంలో ఎంవీ 2 గ్రామంలోని ఒక ఇంటిలో నకిలీ విదేశీ మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మల్కన్‌గిరి ఐఐసీ రీగాన్ కీండోకు ఒక ఇంటిలో నకిలీ విదేశీ మద్యం ఉన్నట్లు ముందస్తు సమాచారం వచ్చింది. దీంతో ఆయన నేతృత్వంలో పోలీసులు ఆ ఇంటిపై దాడిచేసి 14 లీటర్ల నకిలీ విదేశీ మద్యం స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఇద్దరు వ్యక్తులకు అరెస్టు చేశారు. వారు బీహార్, వరంగల్‌కు చెందిన రంజన్ కుమార్, గూడుకుమార్‌లుగా నిర్ధారించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి కోర్టులో గురువారం హాజరుపరిచారు.

రాష్ట్రంలో జిల్లా మేజిస్ట్రేట్లు, ఎస్పీలు బదిలీ

భువనేశ్వర్: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాష్ట్రంలో జిల్లా మేజిస్ట్రేట్లు, పోలీసు సూపరింటెండెంట్లుని బదిలీ చేశారు. త్వరలో జరగనున్న ఎన్నికల నిబంధనల నేపథ్యంలో వీరిని బదిలీ చేయాలని ఈసీఐ నిర్ణయించింది. దేవ్‌గఢ్, కటక్ గ్రామీణ జిల్లాలకు చెందిన పోలీసు సూపరింటెండెంట్లు, ఢెంకనాల్ జిల్లా మేజిస్ట్రేటుని బదిలీ చేస్తూ భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రముఖ రాజకీయ నాయకుల బంధువులు జిల్లా మేజిస్ట్రేట్ లేదా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న జిల్లాలకు సంబంధించినవి కావడంతో బదిలీ చేయాల్సి వచ్చినట్లు ఎన్నికల సంఘం పేర్కొంది.

దోపిడీ దొంగల ముఠా అరెస్టు



పోలీసులకు పట్టుబడిన నిందితులు


బరంపురం: జిల్లాలోని కుదలాలో బుధవారం అర్ధరాత్రి ఒక ఇంటిలో దోపిడీ చేసేందుకు సిద్ధమవుతున్న ముఠాని పోలీసు అరెస్టు చేశారు. వారి దగ్గర నుంచి నంబర్ ప్లేట్లు లేని బైక్‌లు, 2 కత్తులు, 2 టార్చిలైట్లు, 2 ఇనుప రాడ్లు, 4 లైవ్ బాంబులు స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు. అరెస్టైనవారిని కోర్టులో హాజరుపరిచి జైలుకి తరలించారు.

చిలికా చిక్కేదెలా..?

- నియోజకవర్గంపై బీజేడీ కన్ను
- తెరపైకి ప్రసన్న కుమార్‌ను తీసుకొచ్చే యోచన
- సీటుపై బీజేపీ సైతం కసరత్తు



చిలికా సరస్సు





2024 సార్వత్రిక సమరం

భువనేశ్వర్: రాష్ట్ర రాజకీయాల్లో చిలికా నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం ఉంది. చిలికా శాసనసభ నియోజకవర్గం సరిహద్దు ప్రాంతం కావడంతో విభిన్న ప్రాధాన్యత సంతరించుకుంది. వాస్తవానికి ప్రత్యక్ష రాజకీయాల్లో దీనిపై ఖుర్దా జిల్లా ప్రభావం అధికంగా ఉంటుంది. భౌగోళిక సరిహద్దుల ప్రకారం పూరీ జిల్లాలో ఉంది. అలాగే భువనేశ్వర్ పార్లమెంటరీ నియోజకవర్గానికి సరిహద్దు కావడంతో పూరీ పార్లమెంటరీ నియోజకవర్గంలో విలీనమై కొనసాగుతోంది. ఈ శాసనసభ ప్రాతినిధ్యంలో ఖుర్దా జిల్లా పెత్తనం చలామణి అవుతుంది. ఇక్కడ ఎమ్మెల్యే ప్రాబల్యం భువనేశ్వర్ పార్లమెంటరీ నియోజకవర్గం పోలింగ్‌లో ఉపకరిస్తుంది.

సందిగ్ధంలో బీజేడీ

గత ఎన్నికల్లో బిజూ జనతా దళ్ అభ్యర్థి ప్రశాంత జగదేవ్ ఇక్కడ విజయం సాధించారు. అయితే ఇటీవల ఆయన బీజేడీకి గుడ్ బై చెప్పి బీజేపీలో చేరారు. దీంతో రానున్న ఎన్నికల్లో ఆయన స్థానాన్ని ఎవరితో భర్తీ చేయాలనే ఆలోచనలో బీజేడీ తలమునకలైంది. దీనిలో భాగంగా ఈసారి చిలికా నియోజకవర్గం నుంచి డాక్టర్ ప్రసన్న కుమార్ పటసహాణిని దించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు సమాచారం. ఈ యోచనతో ప్రసన్న కుమార్ పాత్ర మరోసారి ప్రత్యక్ష ఎన్నికల్లో తెరపైకి వచ్చింది. ఆయన బిజూ జనతా దళ్‌లో విద్యాధికుడు, ఆసు కవి, ఓటరుని ఇట్టే ఆకట్టుకోగలిగే చమత్కారిగా పేరొందారు. అధిష్టానం నిర్ణయంతో ఆయన ప్రత్యక్ష ఎన్నికల పోరు నుంచి దూరమై విధేయుడుగా మిగిలిపోయారు. అయితే ప్రస్తుత అనిశ్చితి వాతావరణాన్ని అవలీలగా ఎదుర్కోగలిగే దక్షత ఆయనకే ఉందని అధిష్టానం భావిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రసన్న కుమార్ పటసహాణి మరోసారి ప్రత్యక్ష ఎన్నికల్లో తన సత్తా చాటేందుకు పునః రంగ ప్రవేశం చేయడం తథ్యం. చిలికా నియోజకవర్గం నుంచి ఆయన రాష్ట్ర శాసన సభకు ఇదివరకే వరుసగా 4 సార్లు ఎన్నికై చరిత్రని సృష్టించారు.

బీజేపీతో సరితూగునా..?

చిలికా నియోజకవర్గంపై భారతీయ జనతా పార్టీకి రాజకీయంగా గట్టిపట్టు ఉంది. దీర్ఘకాలంగా తెరమరుగైన పటసహాణి చతురత బీజేపీతో తలపడేందుకు ఎంతవరకు దోహదపడుతుందోననే విశ్లేషణతో ఉభయ పార్టీల అధిష్టానాలు మల్లగుల్లాలు పడుతున్నాయి. ఈ నియోజకవర్గంలో హరిచందన్ కుటుంబీకులకు గట్టిపట్టు ఉంది. సమగ్రంగా చిలికా శాసనసభ నియోజకవర్గంలో బీజేడీ, బీజేపీ మధ్య గట్టి పోటీ నెలకొంటుంది. డాక్టర్ బిభూతి భూషణ్ హరిచందన్ చాలాసార్లు ఈ స్థానం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఈసారి భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత పృథ్వీరాజ్ హరిచందన్ ఇక్కడి నుంచి పోటీ చేయనున్నట్లు సమాచారం.

తొలి సమావేశంలో పటసహాణి

అభ్యర్థుల ఖరారు, సీట్ల కేటాయింపు వ్యవహారం పురస్కరించుకుని నవీన్ నివాస్‌లో జరిగిన తొలి సమావేశంలో పూరీ పార్లమెంటరీ స్థితిగతులను సమీక్షించారు. ఈ సమావేశానికి బీజేడీ అగ్రస్థాయి నాయకులతో పూరీ జిల్లా సిటింగ్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర నాయకులతో డాక్టర్ ప్రసన్న కుమార్ పటసహాణి కూడా హాజరు కావడం చర్చనీయాంశమైంది. సమావేశం అనంతరం ఆయన స్పందిస్తూ పార్టీ అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి విధేయునిగా కొనసాగుతానని ప్రకటించారు.

పొత్తు కుదిరితే..

బీజేడీ, బీజేపీ ఎన్నికల పొత్తు కుదిరితే చిలికా నియోజకవర్గాన్ని తన ఖాతాలో వేసుకోవాలని బీజేపీ మంతనాలు జరుపుతోంది. పోటీని ఎదుర్కోవడంలో సమర్థవంతమైన అభ్యర్థి ఖరారు కాని పరిస్థితుల్లో, బీజేపీ యోచన ప్రకారం ఈ సీటుని అంకితం చేసి పోటీ నుంచి హుందాగా తప్పుకోవాలని బీజేడీ తన చాతుర్యానికి పదును పెడుతోంది. ప్రశాంత జగదేవ్‌క్షేత్రస్థాయి రాజకీయం బీజేడీకి ప్రతికూల పరిస్థితుల్ని ప్రేరేపించే సందేహంతో పోటీ విషయంలో అత్యంత వ్యూహాత్మకంగా బీజేడీ అడుగులు వేస్తోంది. బీజేపీ మాత్రం ఈ నియోజకవర్గంలో ఎమ్మెల్యే, ఇటీవల పార్టీలో చేరిన ప్రశాంత జగదేవ్‌ని మాత్రం ఈ నియోజకవర్గం నుంచి ప్రత్యక్ష పోటీకి బరిలోకి దింపకుండా, ఆయన బలాన్ని ప్రయోగించి నికరమైన విజయం కోసం పావులు కదుపుతోంది.

మాజీ మంత్రి దామోదర్‌కు తీవ్ర అస్వస్థత



డాక్టర్ దామోదర రౌత్

భువనేశ్వర్: మాజీ మంత్రి, బిజూ జనతా దళ్ (బీజేడీ) సీనియర్ నాయకుడు డాక్టర్ దామోదర్ రౌత్ బ్రెయిన్ డెడ్ అయినట్లు తెలుస్తోంది. అతని పరిస్థితి విషమంగా ఉందని, రాష్ట్ర రాజధానిలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. అతని కుమారుడు సంబిత్ రౌత్ తన తండ్రి పరిస్థితి విషమంగా మారడానికి కారణంగా స్థానిక క్యాపిటల్ హాస్పిటల్ అధికారులను నిందించాడు. ఈ మేరకు అతను మాట్లాడుతూ.. ఈనెల 18వ తేదీన దామోదర్‌కు గుండెపోటు రావడంతో వెంటనే క్యాపిటల్ హాస్పిటల్‌కు తరలించినట్లు వెల్లడించారు. అయితే వైద్యులు కార్డియోపల్మోనరీ రిససిటేషన్ (సీపీఆర్) ఇవ్వడంలో ఆలస్యం చేయడంతో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాల్సి వచ్చిందన్నారు. సీపీఆర్‌ను అందించడంలో జాప్యం కారణంగానే అతని పరిస్థితి విషమంగా మారిందని డాక్టర్లు చెప్పినట్లు పేర్కొన్నారు. తన తండ్రిని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించడానికి 15 నుంచి 20 నిమిషాలు పట్టిందన్నారు. ఈ ప్రక్రియలో మెదడుకు ఆక్సిజన్ సరఫరా లేకపోవడం వల్ల అతని మెదడు విస్తృతంగా దెబ్బతిందని వెల్లడించారు.

ఏడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక

డాక్టర్ దామోదర్ రౌత్ బిజూ జనతా దళ్ వ్యవస్థాపక సభ్యుల్లో ఒకరు. బీజేడీ వ్యవస్థాపకుడు బిజూ పట్నాయక్‌తో సన్నిహితంగా పని చేశారు. 7 సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన ఒడిశా ప్రభుత్వంలో మంత్రిగా పలు శాఖల్లో కీలక బాధ్యతలు వహించారు. ఆ తర్వాత భారతీయ జనతా పార్టీలో చేరి బల్లికుదా ఎరసమ నియోజకవర్గం నుంచి శాసనసభ ఎన్నికల్లో పోటీ చేశారు. ఇదిలా ఉండగా దామోదర్ రౌత్ త్వరగా కోలుకోవాలని, ఆరోగ్యం బాగుండాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఆకాంక్షించారు. పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి దామోదర్ రౌత్ అస్వస్థతకు గురైన విషయం తెలిసి ఆందోళన చెందుతున్నానన్నారు. ఆయనకు మంచి ఆరోగ్యం, దీర్ఘాయుస్సు ఉండాలని ఆకాంక్షించారు.

ఆస్తుల్లో సీఎం నవీన్ పట్నాయక్ టాప్

- రాష్ట్రంలోని ఎమ్మెల్యేల ఆస్తుల వివరాలు వెల్లడించిన ఏడీఆర్
- టాప్ 10లో ఏడుగురు బీజేడీ ఎమ్మెల్యేలు

భువనేశ్వర్: రాష్ట్రంలో అత్యధిక ఆస్తులు కలిగిన ఎమ్మెల్యేల్లో సీఎం నవీన్ పట్నాయక్ టాప్ ప్లేస్‌లో ఉన్నట్లు న్యూఢిల్లీకి చెందిన అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) ప్రకటించింది. రాష్ట్రంలోని సిట్టింగ్ ఎమ్మెల్యేల నేర నేపథ్యం, ఆర్థిక, విద్య, లింగం, ఇతర వివరాల విశ్లేషణను విడుదల చేసింది. ఒడిశా ఎలక్షన్ వాచ్‌తో కలిసి ఏడీఆర్ 2019 అసెంబ్లీ ఎన్నికలు, రాష్ట్రంలో తదుపరి ఉప ఎన్నికలకు నామినేషన్లు దాఖలు చేసేటప్పుడు అభ్యర్థులు దాఖలు చేసిన అఫిడవిట్ల ఆధారంగా జాబితాను వెల్లడించింది. ఈ జాబితాలో టాప్ 10లో ఏడుగురు బీజేడీ ఎమ్మెల్యేలు ఉండడం గమనార్హం.

రూ.64 కోట్లతో అగ్రస్థానం

ఏడీఆర్ విశ్లేషణ ప్రకారం ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ మొత్తం ఆస్తులు దాదాపు సుమారు రూ.64 కోట్లతో అగ్రస్థానంలో ఉన్నారు. రూ.63,64,15,261 విలువైన స్థిరాస్తులు, రూ.23,26,555 విలువైన చరాస్తులను అఫిడవిట్‌లో వెల్లడించారు. నవీన్ తర్వాత ఝార్సుగుడ నియోజకవర్గం ఎమ్మెల్యే, దివంగత మంత్రి నవకిషోర్ దాస్ కుమార్తె దీపాలి దాస్ రూ.40 కోట్ల ఆస్తులతో ద్వితీయ స్థానంలో ఉన్నారు. ఆమెకు రూ.34,40,87,879 విలువైన చరాస్తులు, రూ.5,76,40,400 స్థిరాస్తులు ఉన్నాయి. ఆమె తన తండ్రి హత్య తర్వాత ఉప ఎన్నికలో అసెంబ్లీకి ఎన్నికయ్యారు. బీజేడీకి చెందిన పట్నాగఢ్ ఎమ్మెల్యే సరోజ్ కుమార్ మెహెర్ రూ.31 కోట్ల ఆస్తులతో మూడో స్థానంలో ఉన్నారు. ఏడీఆర్ నివేదిక ప్రకారం ఆయనకు రూ.57,49,827 విలువైన చరాస్తులు, రూ.30,86,05,862 విలువైన స్థిరాస్తులు ఉన్నాయి.

సరోజ్ కుమార్ మెహర్ తర్వాత ఖండపడా నియోజకవర్గం ఎమ్మెల్యే సౌమ్య రంజన్ పట్నాయక్ దాదాపు రూ.30 కోట్లతో ఉన్నారు. అయితే ఇటీవల పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు ఆయనను బీజేడీ సస్పెండ్ చేసింది. అధికార పార్టీకి చెందిన భద్రక్ నియోజకవర్గం ఎమ్మెల్యే సంజీబ్ కుమార్ మల్లిక్ ఆస్తుల విలువ దాదాపు రూ.19 కోట్లు, ధర్మశాల ఎమ్మెల్యే ప్రణబ్ బల్వంత్రాయ్ ఆస్తుల విలువ రూ.17 కోట్లు, ఢెంకనాల్ ఎమ్మెల్యే సుధీర్ కుమార్ సామల్ రూ.14 కోట్లు, భువనేశ్వర్ ఉత్తర ఎమ్మెల్యే సుశాంత్ కుమార్ రౌత్ రూ.13 కోట్ల ఆస్తులు కలిగి ఉన్నారు. బారాబతి–కటక్‌కు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మహ్మద్ మొకీం, జట్నీ నుంచి సురేష్ కుమార్ రౌత్రాయ్ వరుసగా ఆరు, ఏడు స్థానాల్లో ఉన్నారు. ఏడీఆర్ నివేదిక ప్రకారం ఇద్దరికీ దాదాపు రూ.17 కోట్ల ఆస్తులున్నాయి.

ద్రాక్షపండ్ల ట్రక్ బోల్తా



బోల్తాపడిన ట్రక్

బరంపురం: నగర శివారు 16వ నంబర్ జాతీయ రహదారి కొనిసి జంక్షన్‌లో ట్రక్ బోల్తా పడిన ఘటనలో క్లీనర్‌కి తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసు అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని క్లీనర్‌ని రక్షించి ఆస్పత్రికి తరలించారు. పోలీసు అధికారులు తెలిపిన సమాచారం మేరకు.. గురువారం వేకువజామున 4 గంటల సమయంలో డార్జిలింగ్ నుంచి బరంపురం నగరానికి ద్రాక్ష పండ్ల లోడ్‌తో వస్తున్న బారీ ట్రక్ కొనిసి జంక్షన్‌లో బోల్తాపడింది. దీంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని క్రేన్ సాయంతో ట్రక్‌ను యథాస్థితికి తీసుకొచ్చారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ నియంత్రణపై చర్యలు



ట్రాఫిక్ సమస్యను పరిశీలిస్తున్న ఎస్‌డీపీవో అంకిత వర్మ

జయపురం: జయపురం పట్టణంలో అస్తవ్యస్తంగా ఉన్న ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటామని సబ్ డివిజన్ పోలీసు అధికారి ఐపీఎస్ అధికారి అంకిత వర్మ వెల్లడించారు. స్థానిక మున్సిపల్ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయక్‌తో కలిసి పట్టణ పోలీసులతో పట్టణంలోని పలు ప్రాంతాలు తిరిగి ట్రాఫిక్‌ను సమీక్షించారు. రోడ్డుకిరువైపులా గీతలను దాటి పార్క్ చేసిన వాహనాలను ఫొటో తీయమని పోలీసులను ఆదేశించారు. నిర్ధారిత గీత బయటకు తోపుడు బండ్లు రాకూడదని స్పష్టం చేశారు. దుకాణాల ముందు వాహనాలను ఉంచడం వలన ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని అభిప్రాయపడ్డారు. ప్రధాన తపాలా కార్యాలయం ముందు ట్రాన్స్‌ఫార్మర్ వద్దనున్న పండ్ల దుకాణం వెంటనే తొలగించాలన్నారు. కొన్ని తాత్కాలిక తోపుడు దుకాణాలకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంపై ఎస్‌డీపీవో తీవ్రంగా స్పందించారు. వెంటనే ఆ కనెక్షన్లు తొలగించాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలు పాటించాలని సూచించారు.

సమష్టిగా పనిచేస్తే విజయం తథ్యం

- బీజేడీ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు నెక్కంటి



ప్రసంగిస్తున్న నెక్కంటి పక్కనే హిమిరిక, పాత్రోలు

రాయగడ:

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో నాయకులంతా సమష్టిగా పనిచేస్తే విజయం తథ్యమని బీజేడీ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు అన్నారు. స్థానిక రాణీగుడఫారంలోని ఆయన నివాసంలో రాయగడ సమితి పరిధిలోని 18 పంచాయతీలకు చెందిన సమితి సభ్యులు, సర్పంచ్‌లు, వార్డు మెంబర్లతో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో నేపథ్యంలో అంతా సమాయత్తమవ్వాలన్నారు. గతసారి చేసిన తప్పిదాల వల్ల రాయగడ శాసనసభ నియోజకవర్గంలో బీజేడీ పరాజయం పొందిందన్నారు. ఈసారి అటువంటి తప్పిదాలకు తావివ్వకుండా పార్టీ విజయానికి అంతా కలిసికట్టుగా పని చేయాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధికి నిరంతరం కృషి చేసిందని తెలియజేశారు. అంతేకాకుండా ప్రతీ పంచాయతీ అభివృద్ధి కోసం రూ.50 లక్షల నిధులను మంజూరు చేసిందని గుర్తు చేశారు. ఇటువంటి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి కార్యకర్తలు, పార్టీ నాయకులు ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పథకాలే పార్టీ విజయాలకు నాంది పలికే విధంగా ప్రజలకు అవగాహన కలిగించాలని సూచించారు. అధిష్టానం ఎవరికి టిక్కెట్టు కేటాయించినా వారి విజయానికి మాత్రమే పని చేయాలని, వ్యక్తిగత కక్షలకు తావివ్వకూడదని స్పష్టం చేశారు.

బూత్‌ల వారీగా పనిచేయాలి

కార్యకర్తలు, నాయకులు బూత్‌ల వారీగా పనిచేయాలని ఆ పార్టీ మాజీ మంత్రి లాల్‌బిహారి హిమిరిక అన్నారు. ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని సూచించారు. క్షేత్రస్థాయి నుంచి పార్టీ బలోపేతంతో పాటు ప్రజల వద్దకు కార్యకర్తలు వెళ్లాలని సూచించారు. పార్టీ విజయానికి సహకరించే ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాల గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. సమావేశంలో బీజేడీ రాష్ట్ర శాఖ సీనియర్ నాయకుడు జగదీష్ పాత్రో తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన సర్పంచ్‌లు, సమితి సభ్యులు

మీకు తెలుసా..?



స్వాతంత్ర్యానికి ముందే ఒడిశాలో ఎన్నికలు



నవరంగపూర్ నుంచి ఎన్నికైన సదాశివ త్రిపాఠీ



రాధాకృష్ణ బిశ్వాసరాయ్ విగ్రహం



రాధామోహన్ సాహు విగ్రహం

జయపురం: మన దేశంలో 1951 నుంచి ఎన్నికలు జరుగుతున్నాయని అందరి అభిప్రాయం. అయితే ఒడిశా రాష్ట్రంలో మాత్రం దేశానికి స్వాతంత్ర్యం రాకముందు ఒడిశా విధాన సభకు రెండు పర్యాయాలు ఎన్నికలు జరిగాయి. 1935 ఎన్నికల చట్టం అనుసరించి 1936 జనవరి 18 నుంచి 23 వరకు జరిగిన ప్రీ ఒడిశా ఎన్నికల్లో కాంగ్రెస్, రాజుల పార్టీ గణతంత్ర పరిషత్ మధ్య పోటీ జరిగింది. అప్పటి కొరాపుట్ జిల్లా(నేటి అవిభక్త కొరాపుట్ జిల్లాలు కొరాపుట్, రాయగడ, నవరంగపూర్, మల్కన్‌గిరి)ను మూడు నియోజకవర్గాలుగా విభజించారు. వాటిలో ఒకటి నవరంగపూర్ నియోజకవర్గం, రెండోది జయపురం–మల్కన్‌గిరి నియోజకవర్గం, మూడోది కొరాపుట్ నియోజకవర్గం. నవరంగపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా సదాశివ త్రిపాఠి, రాజుల పార్టీ అభ్యర్థిగా న్యాయవాది హరిహర మిశ్రో పోటీ చేశారు. అలాగే జయపురం–మల్కన్‌గిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా రాధాకృష్ణ బిశ్వాసరాయ్, రాజుల పార్టీ నుంచి రాజుగారి అల్లుడు బిద్యాధర సింగ్ దేవ్ ఆయనతో తలపడ్డారు. కొరాపుట్–రాయగడ నియోజకవర్గంలో రాధామోహన్ సాహు కాంగ్రెస్ నుంచి, న్యాయవాది బాలకృష్ణ పాత్రో రాజుల పార్టీ నుంచి నిలబడ్డారు. కొరాపుట్ కలెక్టర్ కార్యాలయంలో 1936 ఫిబ్రవరి 2వ తేదీన ఓట్ల లెక్కింపు జరిగింది. నవరంగపూర్ నియోజకవర్గంలో సదాశివ త్రిపాఠీ తన ప్రత్యర్థిపై 4,768 ఓట్ల తేడాతో విజయం సాధించాడు. కొరాపుట్–రాయగడ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి రాధా మోహన్ సాహు 4,318 ఓట్ల తేడాతో, అదేవిధంగా జయపురం–మల్కన్‌గిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి రాధాకృష్ణ బిశ్వాసరాయ్ తన ప్రత్యర్థిపై 1,757 ఓట్ల తేడాతో గెలిపొందారు. ఆనాడు 60 స్థానాలు కలిగిన శాసనసభకు కొరాపుట్ జిల్లా నుంచి ముగ్గురు ప్రాతినిధ్యం వహించారు. కాంగ్రెస్ లీడర్ బిశ్వనాథ్ దాస్ ముఖ్యమంత్రిగా ఉండేందుకు అంగీకరించకపోవడంతో, పర్లాకిమిడి మహారాజు కృష్ణచంద్ర గజపతి నారాయణ దేవ్‌ని ప్రధానమంత్రిగా ఎన్నుకున్నారు. ఆనాడు ముఖ్యమంత్రిని ప్రధానమంత్రి అనేవారు.

1947లో ఎన్నికలు...

అనంతరం దేశ స్వాతంత్ర్యానికి ముందు జరిగిన ఎన్నికల్లో సైతం కొరాపుట్ జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ తన పట్టును కోల్పోలేదు. శాసన సభలో మూడు స్థానాలను చేజిక్కించుకుంది. కొరాపుట్ జనరల్ స్థానంలో కాంగ్రెస్‌తో తలపడిన ఆంధ్ర మహాసభ అభ్యర్థికి ఓటమి తప్పలేదు. అలాగనే జయపురం–మల్కన్‌గిరి, నవరంగపూర్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులతో పోటీపడిన స్వతంత్ర అభ్యర్థులు ఓటమి చెందారు. ఈ ఎన్నికల్లో హరికృష్ణ మెహతాబ్ ముఖ్యమంత్రి కాగా, ఆయన మంత్రివర్గంలోని నలుగురు మంత్రుల్లో జయపురం – మల్కన్‌గిరి నియోజకవర్గం నుంచి ఎన్నికైన రాధాకృష్ణ బిశ్వాసరాయ్ ఒకరు కావడం విశేషం. ఈ రెండు ఎన్నికల తర్వాత దేశంలో 1951లో మొదటి సార్వత్రిక ఎన్నికలు జరిగాయి.

క్లుప్తంగా

గేట్ ర్యాంకర్లకు అభినందన

ఎచ్చెర్ల క్యాంపస్: కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థల్లో సాంకేతిక విద్యలో పోస్టు గ్రాడ్యుయేషన్ చదివేందుకు నిర్వహించిన గేట్‌లో శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో చివరి ఏడాది ఇంజినీరింగ్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. శ్రీకాకుళం క్యాంపస్‌కు సంబంధించి ఇంజినీరింగ్ చివరి ఏడాది క్లాస్‌వర్క్ నూజివీడు విద్యా సంస్థలో కొనసాగుతోంది. 42 మంది విద్యార్థులు శ్రీకాకుళం ఆర్జీయూకేటీ క్యాంపస్ నుంచి ఉత్తమ ర్యాంకులు సాధించారు. నూజివీడులో ర్యాంకర్లను గురువారం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎం.విజయ్‌కుమార్, స్థానిక క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ ప్రత్యేకంగా అభినందించారు.

సంరక్షణలో ఉన్న చుక్కల దుప్పి మృతి


మృతి చెందిన దుప్పి

టెక్కలి రూరల్: మండలంలోని రావివలస తేలినీలాపురం పక్షుల విడిది కేంద్రంలో సంరక్షణ కోసం ఉంచిన చుక్కల దుప్పి గురువారం మృతిచెందింది. ఈ నెల 15వ తేదీన నందిగాం మండలం జయపురం గ్రామ సమీపంలోని తెట్టంగి పంట పొలాల్లో ఇరుక్కుని ఉన్న దుప్పిని గ్రామస్తులు గుర్తించి అటవీ శాఖాధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అటవీ శాఖాధికారులు ఆ చుక్కల దుప్పిని టెక్కలి సమీపంలోని విదేశీ పక్షుల విడిది కేంద్రంలో ఉంచారు. అప్పటి నుంచి అక్కడే సంరక్షణ పొందుతున్న ఆ దుప్పి గురువారం మృతిచెందింది. అనంతరం పశుసంవర్ధక శాఖాధికారులు దుప్పిని పోస్టుమార్టం చేశారు. అయితే ఆ దుప్పి మృతిచెందడానికి అటవీ శాఖాధికారులు, సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఏప్రిల్ 7న జిల్లా స్థాయి మేధా సమ్మాన్ ప్రతిభ పరీక్ష


కవిటి:సమావేశంలో మాట్లాడుతున్న అపోటా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బృందావన్ దొళాయి

కవిటి: జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఒడియా మాధ్యమం చదువుతున్న విద్యార్థుల భాషాభివృద్ధికి ఏపీ ఒడియా టీచర్స్ అసోసియేషన్ (అపోటా) చిత్తశుద్ధితో కృషి చేస్తుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బృందావన్ దొళాయ్ అన్నారు. పెద్దమెళియాపుట్టుగలో ఈ మేరకు గురువారం మేధా సమ్మాన్ ప్రవేశ పరీక్ష నిర్వహణకు సన్నాహక సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఒడియా మాధ్యమం చదువుతున్న 5వ తరగతి పిల్లలకు ఏప్రిల్ 7న జిల్లా స్థాయి మేధా సమ్మాన్ ప్రతిభ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇచ్ఛాపురం, కంచిలి, కవిటి, సోంపేట, మందస, పలాస, టెక్కలి, మెళియాపుట్టి, పాతపట్నం, భామిని మండలాల్లో పరీక్షలు జరుగుతాయని వివరించారు. దీనికి అన్ని ఏర్పాట్లు చేయాలని సభ్యులకు సూచించారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

కంచిలి: మండలంలోని మకరాంపురం గ్రామానికి చెందిన బొగియా కృష్ణమూర్తి(44) అనే వ్యక్తి విద్యుత్‌షాక్‌కు గురై గురువారం మృతి చెందాడు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. కృష్ణమూర్తి మకరాంపురం జంక్షన్‌లో వెల్డింగ్, పెయింటింగ్ షాపు పెట్టుకుని జీవిస్తున్నాడు. ఎప్పటిలాగానే గురువారం మధ్యాహ్నం ఓ ఆటోకు వెల్డింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్‌షాక్ కొట్టింది. దీంతో పడిపోయాడు. వెంటనే అతడిని సోంపేట సామాజిక ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మధ్యాహ్నం 1.15 గంటలకు మృతి చెందినట్లు డ్యూటీ డాక్టర్ నిర్ధారించారు. మృతునికి భార్య ఢిల్లీశ్వరితో పాటు పదేళ్లు, రెండేళ్ల వయసున్న ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని భార్య ఢిల్లీశ్వరి ఫిర్యాదు మేరకు కంచిలి హెచ్‌సీ కె.ఈశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అవివాహిత ఆత్మహత్య

కవిటి: మండలంలోని మాణిక్యపురానికి చెందిన జానకిబిసాయి(43) బుధవారం రాత్రి తన ఇంటిలో ఆత్మహత్య చేసుకున్నట్లు కవిటి పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జానకి బిసాయి తల్లిదండ్రులకు ముగ్గురు సంతానంలో ఈమె చిన్నది. సోదరుడు దేవరాజ్ బిసాయితో ఉంటోంది. చాలా రోజులుగా జానకికి పెళ్లిచేయాలనే ఆలోచనతో పలు సంబంధాలు చూశారు. కానీ ఏవీ కుదరకపోవడంతో ఆమె కొన్నాళ్లుగా తీవ్రంగా వేదన చెందుతోంది. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి 10.30గంటల సమయంలో తన ఇంట్లోనే దూలానికి పంచెను కట్టుకుని ఉరిపోసుకుంది. వెంటనే విషయం తెలుసుకున్న పోలీసులు చీకటిపడిన కారణంగా మృతదేహాన్ని గురువారం ఉదయం సోంపేట ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టంకు తరలించారు.

భారీగా గంజాయి పట్టివేత

జయపురం: ఒక కంటైనర్‌లో తరలిస్తున్న గంజాయిని పట్టుకొని, ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు సదర్ పోలీసు అధికారి ఈశ్వర తండి గురువారం వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే.. సదర్ ఎస్‌ఐ పంచానన శతపతి తన సిబ్బందితో బుధవారం రాత్రి 26వ నంబర్ జాతీయ రహదారి కుమిలిపుట్ ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో కుమిలిపుట్ వంతనపై నుంచి వస్తున్న ఒక కంటైనర్‌ను ఆపి అనుమానంతో తనికీ చేయగా 397 కిలోల గంజాయి బయటపడింది. దీంతో వాహనంలో ఉన్నటువంటి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. అరెస్టైన వ్యక్తులు బీహార్‌కు చెందిన అభిమన్యురాయ్, శుభాజిత్ కుమార్‌లుగా వెల్లడించారు. నిందితులను విచారించగా వారు మల్కన్‌గిరి జిల్లా మారుమూల ప్రాంతంలో గంజాయి కొనుగోలు చేసి నబరంగపూర్ మీదుగా బీహార్ రాష్ట్రానికి తీసుకెళ్తున్నట్లు చెప్పినట్లు వెల్లడించారు. నిందితులను జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి సమక్షంలో హాజరుపరిచామన్నారు.

యువకుడు అరెస్టు

గంజాయి తరలిస్తున్న యువకుడిని జయపురం పట్టణ పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన యువకుడు జయపురం కేబీఎస్‌డీ రోడ్డుకు చెందిన షేక్ అక్బర్ అని వెల్లడించారు. అతని వద్ద 21 కేజీల 100 గ్రాముల గంజాయి స్వాధీన పరచుకున్నారు. దీని విలువ రూ.2 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. నిందితుడు గంజాయితో చేసిన సిగరెట్లను అమ్ముతున్నాడని తెలిపారు. అతడు ఎంతో కాలంగా వివిధ ప్రాంతాల్లో గంజాయి కొని వ్యాపారం చేస్తున్నాడని పేర్కొన్నారు. గంజాయి సిగరెట్లను స్కూలు, కాలేజీ విద్యార్థులు, యువతకు సరఫరా చేస్తున్నట్లు అనుమానిస్తున్నారు. స్థానిక సూర్యమహల్ ప్రాంతంలో అతడు వ్యాపారం చేస్తుడడం వలన ఆ ప్రాంతంలో అసాంఘిక శక్తుల కార్యకలాపాలు పెరుగుతున్నాయని ఆరోపణలు రావడంతో, అతడిపై దృష్టి సారించినట్లు వెల్లడించారు. పట్టణ ఏఎస్‌ఐ రమేష్ మహాపాత్రో పోలీసు సిబ్బందితో పెట్రోలింగ్ జరుపుతున్న సమయంలో, స్థానికి తరణి కూడలి వద్ద బైక్‌పై వస్తున్న అతడిని తనికీ చేయగా గంజాయి పట్టుబడిందని పేర్కొన్నారు. అతడిని కోర్టుకు తరలించామన్నారు.


బరంపురం: సీజ్ చేసిన స్కూటీ, గంజాయి బస్తాలు


జయపురం: పట్టుబడిన నిందితులు


జయపురం: గంజాయితో పట్టుబడిన నిందితుడు అక్బర్



జయపురం: సీజ్ చేసిన కంటైనర్

బరంపురం: గంజాం జిల్లా బంజనగర్ సబ్ డివిజన్ పరిధిలో అక్రమంగా బరంపురం నగరం మీదుగా భువనేశ్వర్‌కు రవాణా చేస్తున్న 32.50 కిలోల గంజాయిని ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. ఎక్సైజ్ అధికారి పార్థసారథి తెలిపిన వివరాల మేరకు.. గురువారం ఉదయం బంజనగర్ ఉప జిల్లా పరిధి దక్షిణ ఘుముసరా అటవీ డివిజన్ దుర్గమ కొండ ప్రాంతం నుంచి భువనేశ్వర్‌కు స్కూటీలో గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం వచ్చింది. దీంతో అధికారులు దాడిచేసి 32.50 కిలోల గంజాయి బస్తాలు సీజ్ చేశారు. అయితే అధికారుల దాడుల సమయంలో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తి వాహనాన్ని విడిచి తప్పించుకున్నట్లు పేర్కొన్నారు. సీజ్ చేసిన 32.50 కిలోల గంజాయి విలువ, సుమారు రూ.2 లక్షల ఉంటుందని వెల్లడించారు.

సమన్వయంతో సజావుగా ఎన్నికలు


ప్రసంగిస్తున్న కలెక్టర్ మహాజన్, పక్కనే ఎస్పీ హరీష్, రైతా తదితరులు

- కలెక్టర్ మనోజ్ మహాజన్


సమావేశంలో పాల్గొన్న అధికారులు

రాయగడ: జిల్లాలో మే 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికలు సజావుగా సాగాలంటే జిల్లా యంత్రాంగంతో పాటు పోలీసు విభాగం సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ అన్నారు. స్థానిక డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో జిల్లా పోలీసులు, అధికారులు, సిబ్బందితో ఎన్నికల నిర్వహణకు సంబంధించి సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని బిసంకటక్, గుణుపూర్, రాయగడ శాసనసభ నియోజకవర్గాలతో పాటు, కొరాపుట్ లోక్‌సభ స్థానంలో భాగమైన ఈ మూడు నియోజకవర్గాల్లో పనిచేస్తున్న పోలీసు అధికారులు, జిల్లా యంత్రాంగం అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎన్నికల ముందు ప్రతీ బూత్ పరిశీలించాలని సూచించారు. అక్కడ ఏర్పాట్లను సమీక్షించాలన్నారు. అదేవిధంగా ప్రతీ ప్రాంతంలో నిఘా పెట్టడంతో పాటు శాంతి భద్రతలను పరిక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. దీనికోసం పోలీసులు తమ విధుల్లో భాగంగా ముమ్మర తనిఖీలను నిర్వహించాలన్నారు. ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు మరింత ముమ్మరం చేయాలని పేర్కొన్నారు. ఎస్పీ హరీష్ బీసీ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే ఎన్నికలకు సంబంధించి పోలీసు విభాగం కట్టుదిట్టమైన ఏర్పాట్లను నిర్వహిస్తుందన్నారు. నిఘా పెంచడంతో పాటు విరివిగా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. అక్రమంగా మద్యం రవాణా, నాటుసారా తయారీపై చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. పోలీసు యంత్రాంగంతో పాటు అబ్కారీ శాఖ అధికారులు కూడా సంయుక్తంగా దాడులను నిర్వహిస్తున్నారని వివరించారు. సమావేశంలో జిల్లా అదనపు మేజిస్ట్రేట్ భాస్కర రైతా, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి నిహారి రంజన్ కుహరో, ఏఎస్పీ బిష్ణు ప్రసాద్ పాత్రో తదితరులు పాల్గొన్నారు.

150 మిలియన్ టన్నుల సరుకు రవాణా

- ఖుర్దా రోడ్ డివిజన్ రికార్డు


ఖుర్దారోడ్ రైల్వే మండలంలో సరుకు రవాణా

భువనేశ్వర్: తూర్పు కోస్తా రైల్వే ఖుర్దా రోడ్ డివిజన్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 1 ఏప్రిల్ 2023 నుంచి 12 మార్చి 2024 వరకు కేవలం 347 రోజుల్లో 150 మిలియన్ టన్నుల సరుకు రవాణా చేసి రికార్డు సృష్టించింది. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే 9 రోజుల ముందుగానే డివిజన్ ఈ మైలురాయిని సాధించింది. గత ఆర్థిక సంవత్సరం 2022–2023లో ఇదే లక్ష్యాన్ని చేరుకోవడానికి 356 రోజులు పట్టింది. సరికొత్త రికార్డు 150 మిలియన్ టన్నుల సరుకు రవాణాతో ఖుర్దారోడ్ మండలం రూ.13,674 కోట్ల ఆదాయం ఆర్జించిందని స్థానిక మండల రైల్వే అధికారి డీఆర్‌ఎం హెచ్.ఎస్.బాజ్వా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన రాత్రింబవళ్లు శ్రమించిన సిబ్బంది, అధికారులకు అభినందనలు తెలియజేశారు. ఖుర్దా రోడ్ మండలవ్యాప్తంగా అన్ని లోడింగ్ పాయింట్ల వద్ద ప్రభుత్వ రంగ సంస్థలు, పరిశ్రమలతో సరైన ప్రణాళిక మరియు సమన్వయంతో లక్ష్యాన్ని నిర్ధారిత సమయం కంటే ముందుగానే సాధించడమైందని తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఖుర్దా రోడ్ డివిజన్ 112.64 మిలియన్ టన్నుల బొగ్గును, 7.36 మిలియన్ టన్నుల ముడి పదార్థాలను ఉక్కు కర్మాగారాలకు, 12.42 మిలియన్ టన్నుల పిగ్ ఐరన్, ఫినిష్డ్ స్టీల్, 7.15 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజం, 4.15 మిలియన్ టన్నుల బొగ్గును లోడ్ చేసింది. 6.64 మిలియన్ టన్నుల సిమెంట్, 4.09 మిలియన్ టన్నుల ఎరువు, 6.64 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాలు, ఖనిజ తైలం మొదలైన సరుకులు రవాణా చేసింది. ఖుర్దా రోడ్ డివిజన్ భారతీయ రైల్వేలో లోడింగ్, అన్ లోడింగ్ రెండింటిలోనూ 277 మిలియన్ టన్నుల రవాణా నిర్వహించిన మొదటి, ఏకైక డివిజన్‌గా నిలవడం విశేషం. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 12 వరకు డివిజన్ 150 మిలియన్ టన్నుల సరుకును లోడ్, 127 మిలియన్ టన్నులను అన్‌లోడ్ చేసింది.

'దొంగ ఓట్ల నమోదుపై చర్యలు తీసుకోండి'


టెక్కలి సబ్‌కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఏపీఈడబ్ల్యూడీసీ డైరెక్టర్ విశ్వనాథం, జేసీఎస్ ఇన్‌చార్జి మోహన్

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి లచ్చన్నపేట గ్రామానికి చెందిన ఇప్పిలి కృష్ణవేణి అనే మహిళ కొంత మంది టీడీపీ కార్యకర్తల ప్రోత్సాహంతో దొంగ ఓటు నమోదు చేసుకున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలని ఏపీఈడబ్ల్యూడీసీ డైరెక్టర్ యు.విశ్వనాథం, జేసీఎస్ ఇన్‌చార్జి ఎస్.మోహన్ టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ ఖమర్‌కు గురువారం ఫిర్యాదు చేశారు. ఒక పోలింగ్ బూత్‌లో ఇప్పిలి కృష్ణవేణిగా మరో బూత్‌తో బలగ కృష్ణవేణిగా దొంగ ఓట్లు నమోదు చేశారని వెల్లడించారు. కోటూరు గ్రామానికి చెందిన విశ్రాంత ఎంఈఓ బసవల అప్పలస్వామి, బసవల భీష్మ సాయంతో టీడీపీ కార్యకర్తల ప్రోత్సాహంతో దొంగ ఓట్లు నమోదు చేశారని దీనిపై చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రకాష్ దాస్‌తో బీజేడీ నాయకుల సమావేశం


సమావేశంలో పాల్గొన్న నాయకులు

కొరాపుట్: బిజూ జనతా దళ్ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రణవ్ ప్రకాష్ దాస్ (బబిదాస్)తో కొరాపుట్ జిల్లాలకు చెందిన బీజేడీ ముఖ్య నాయకులు సమావేశమయ్యారు. బుధవారం ముఖ్యమంత్రి నవీన్ కొరాపుట్, నబరంగ్‌పూర్ లోక్‌సభ స్థానాల పరిధిలోని ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే ముఖ్యమంత్రి ముందు పెదవి విప్పలేక తమ మనసులో మాటను చెప్పుకోవడానికి బబిదాస్‌ను నాయకులు ఆశ్రయించారు. దీంతో గురువారం ఉదయం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయం శంఖ భవన్‌లో బబిదాస్ అల్పాహార సమావేశం నిర్వహించారు. దీనికి కొరాపుట్, నబరంగ్‌పూర్, మల్కన్‌గిరి జిల్లాలకు చెందిన ఎంపిక చేసిన నాయకులు హాజరయ్యారు. రాష్ట్రంలో బీజేడీ–బీజేపీ పొత్తు ఏర్పడితే పార్టీకి తీవ్రనష్టం అవుతుందని నాయకులు ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఈ పరిణామంతో చాలా మంది రాజకీయ భవిష్యత్ కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారని సమాచారం. తమలో తమకి ఎన్ని విభేదాలున్నా సర్దుకుపోతామని, కానీ పొత్తుపై తొందరపడి నిర్ణయం వద్దని గొంతు విప్పారు. తమ రాజకీయ భవిష్యత్‌కి బబిదాస్ భరోసా ఇవ్వాలని కోరారు. అనంతర బబి దాస్ మాట్లాడుతూ అందరికీ సముచిత న్యాయం జరుగుతుందన్నారు. పొత్తుపై ప్రస్తావనలు వద్దు అన్నారు. పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా అందరూ శిరసావహించాలని సూచించారు. ఏప్రిల్ 18న నోటిఫికేషన్ వెలువడుతున్నందున అంతవరకు ప్రజలతో మమేకమవ్వాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడిన వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సమావేశంలో ప్రకాష్ మహంతి, నబరంగ్‌పూర్ ఎంపీ రమేష్ మఝి, కేసీసీ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్ పాణిగ్రాహీ, ఎస్‌డీసీ సలహాదారుడు ప్రదీప్ మఝి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకూర్మంలో డోలోత్సవ వైభవం


శ్రీకూర్మనాథాలయం

- నేటి రాత్రి కామదహనోత్సవం
- 23, 24వ తేదీల్లో పడియా
- 25వ తేదీన డోలోత్సవం


శ్రీకూర్మనాథుడు

గార: ప్రసిద్ధ వైష్ణవ క్షేత్రం శ్రీకూర్మంలో శుక్రవారం నుంచి డోలోత్సవం ప్రారంభం కానుంది. తొలి రోజు రాత్రి 10 గంటల నుంచి కామదహనోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఏటా ఫల్గుణ మాస త్రయోదశి నాడు మఘ నక్షత్రంలో జరిగే ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు తరలి వస్తారు. తొలుత స్వామి ఉత్సవ మూర్తులను గరుడ వాహనంపై ఉంచి మేళతాళాలలతో తిరువీధి నిర్వహిస్తారు. అనంతరం గ్రామ సమీపంలోని కామదహనం మంటపం వద్ద కామదహన కార్యక్రమాన్ని వేదపండితులు నిర్వహిస్తారు. వరుసగా శని, ఆదివారాల్లో రెండు రోజుల పాటు సముద్ర స్నానాలు (పడియా) జరుగుతాయి. అనంతరం శ్వేతపుష్కరిణిలో పవిత్ర స్నానాలాచరిస్తారు. సోమవారం ఉదయం డోలో మంటపంలో స్వామి ఉత్తరాభిముఖదర్శనం ఇస్తారు.

భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు

నాలుగు రోజులపాటు నిర్వహించే ఈ డోలోత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని, స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు ఆలయ ఈఓ జి.గురునాథం తెలిపారు.

అడవులే జీవనాధారం

రాయగడ: సమస్త ప్రాణులకు అడవులే జీవనాధారమని, అటువంటి అడవులను సంరక్షించడం మనందరి కర్తవ్యమని కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ అన్నారు. స్థానిక రైతుల కాలనీలోని ఫారెస్ట్ పార్క్‌లో ప్రపంచ అటవీ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. దీనిలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు సంరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్పీ హరీష్ బీసీ, డీఎఫ్‌వో సచిన్ అన్నాసాహేబ్, ఒహాలే తదితరులు పాల్గొన్నారు.

బరంపురం: స్థానిక టౌన్ హాల్‌లో సుబజ వాని ఆధ్వర్యంలో అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సుబజ వాని ప్రతినిధులు మాట్లాడుతూ.. నిప్పుని ఆర్పి అడవులను రక్షించుకుందామని నినాదం ఇచ్చారు. అలాగే స్థానిక బేజ్జిపూర్ నీలకంఠ నగర 3వ లైన్‌కు చెందిన సైకత శిల్పి సత్యనారాయణ మహరణ తన కళా నైపుణ్యంతో చేసిన నిప్పుని ఆర్పి అడవిని రక్షించుకుందాం సైకత శిల్పం ప్రజలను ఆకట్టుకుంది.

జయపురం: అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన అవసరమని జయపురం డీఎఫ్‌వో ప్రమోద బెహర అన్నారు. జయపురం అటవీ విభాగ రేంజర్ సచ్చిదానంద పొరిడ ఆహ్వానం మేరకు అడవుల్లో అగ్ని ప్రమాదాల నియంత్రణ సచేతన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడవుల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే పర్యావరణానికి తీవ్రనష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అందువలన అడవుల్లో అగ్ని ప్రమాదాలు నివారించేందుకు సిబ్బంది చర్యలు చేపట్టాలని, వారికి ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఫారెస్టర్ రంజిత్ నాయక్, ఫారెస్టర్ అరుణ జెన తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ ఉద్యోగులకు సత్కారం

పర్లాకిమిడి: స్థానిక జిల్లా అటవీ శాఖ ముఖ్య కార్యాలయంలో ప్రపంచ అటవీ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అటవీ సంరక్షణ సిబ్బంది, వన్య ప్రాణులను రక్షించిన జంగిల్ సురక్షా కార్యకర్తలను సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి సుబ్రహ్మణ్యం ఆనంద్, ప్రభుత్వ వన సంరక్షక అధికారి అరుణ్ కుమార్ సాహు, సయినిశ్రీదాస్, మోహనా బ్లాక్ పోయిపాణి ప్రాథమిక విద్యాలయం హెచ్‌ఎం కరుణాకర్ రైకా తదితరులు పాల్గొన్నారు.


పర్లాకిమిడి: అటవీ సంరక్షణ ఉద్యోగులు, జంగిల్ కార్యకర్తలతో డీఎఫ్‌వో ఆనంద్


జయపురం: మాట్లాడుతున్న డీఎఫ్‌వో సచ్చిదానంద


బరంపురం: సుబజ వాని ఆధ్వర్యంలో అటవీ దినోత్సవ వేడుకలు


బరంపురం: సత్యనారాయణ మహరణ తీర్చిదిద్దిన సైకత శిల్పం


రాయగడ: మొక్కలు నాటుతున్న కలెక్టర్ మహాజన్, ఎస్పీ హరీష్ తదితరులు

క్లుప్తంగా

14,500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



బెల్లపు ఊటలను ధ్వంసం చేసిన పోలీస్ సిబ్బంది

పార్వతీపురంటౌన్: ఎన్నికల నేపథ్యంలో ఆంధ్రా ఒడిశా పోలీసులు సంయుక్త తనిఖీ చేపట్టారు. ఈ మేరకు కొమరాడ, పార్వతీపురం సబ్ఇన్‌స్పెక్టర్‌లు, కొరాపుట్ జిల్లా బందుగాం పోలీస్‌స్టేషన్ సిబ్బంది గురువారం పార్వతీపురం మండలం, ఇతర ప్రాంతాల్లో చేపట్టిన తనిఖీల్లో 14,500 లీటర్ల పులియబెట్టిన బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. అలమండ గ్రామం వద్ద 32 డ్రమ్ముల్లో ఉన్న పది వేల లీటర్లను, కర్లి గ్రామం వద్ద 15 డ్రమ్ముల్లో లభ్యమైన 4,500 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు.

హైరిస్క్ గర్భిణులను గుర్తించండి

- డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: హైరిస్క్ గర్భిణులను త్వరగా గుర్తించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం మాతా, శిశు మరణాలపై నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ప్రసవ తేదీకి వారం రోజుల ముందు గర్భిణులను ఆస్పత్రుల్లో చేర్పించడం ద్వారా మాతాశిశు మరణాలను నివారించవచ్చన్నారు. గర్భిణిగా నమోదైనప్పటి నుంచి ఆరోగ్య జాగ్రత్తలు వివరించాలని సూచించారు. సమావేశంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ బి. గౌరీశంకర్, డీఐఓ డాక్టర్ అచ్యుత కుమారి, ఘోషాస్పత్రి హెచ్‌ఓడీ డాక్టర్ అరుణ శుభశ్రీ,, వైద్యులు పాల్గొన్నారు.

ఎంఎన్‌ఓపై సస్పెన్షన్ వేటు

పార్వతీపురం: కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎంఎన్‌ఓగా విధులు నిర్వహిస్తున్న సీహెచ్.కిరణ్‌కుమార్‌పై సస్పెన్షన్ విధించినట్లు ఇన్‌చార్జ్ జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవ నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజకీయపార్టీలకు సంబంధించిన పోస్టు చేసినందుకుగాను ఆయనపై సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారన్నారు. ఈనెల 27 తేదీన ఇడుపులపాయలో వైఎస్ఆర్ పార్టీ బస్సు యాత్ర ప్రారంభమవుతుందని కిరణ్‌కుమార్ పేరుతో సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసినందుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఏ ఎద్యోగి ఉల్లంఘించినా చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

గాయపడిన యువకుడి మృతి



మణికంఠ (ఫైల్)

భామిని: రోడ్డు ప్రమాదంలో గాయడిపడిన భామిని మండలంలోని బురుజోలకు చెందిన ఊయక మణికంఠ(24) శ్రీకాకుళం జిల్లాలోని రాగోలు జెమ్స్ అస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు.ఈ నెల18వ తేదీన కొత్తూరు మండలంలోని మహాసింగి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మణికంఠ తీవ్రంగా గాయపడడంతో కొత్తూరు పోలీసులు కేసు నమోదు చేసి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అందిస్తుండగా మరణించినట్లు మృతుని బంధువులు తెలిపారు. మృతుడి తల్లిదండ్రులు చిన్నప్పుడే చనిపోగా అన్నా వదిన, ఇద్దరు అక్కలున్నారు.

శాటిలైట్ తయారీకి సాంకేతిక సహకారం

- సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ దుర్గా ప్రసాద్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ దుర్గా ప్రసాద్

నెల్లిమర్ల రూరల్: శాటిలైట్ తయారీకి విద్యార్థులు ముందుకొస్తే సాంకేతిక సహకారం అందిస్తానని సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ దుర్గా ప్రసాద్ అన్నారు. ఈ మేరకు నెల్లిమర్ల మండలంలోని టెక్కలి సెంచూరియన్ యూనివర్సిటీలో గురువారం మిషన్ టు ది మూన్-సాంకేతిక అవకాశాలు, సవాళ్లు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఫిజికల్ రీసెర్చ్ ల్యాబొరేటరీలో ఇంటర్న్‌షిప్, ప్రాజెక్టులు చేసుకునేందుకు అవకాశం ఉందని, ఉద్యోగావకాశాలు కూడా మెండుగా ఉన్నాయన్నారు. వీసీ పీకే మహంతి మాట్లాడుతూ చంద్రుడి ఉపరితల వాతావరణంలో వివిధ ఉష్ణోగ్రతల మార్పులు కనుగొనేందుకు ఉపకరించే పరికరాన్ని తయారు చేయడంలో దుర్గాప్రసాద్ కీలక పాత్ర పోషించారని తెలియజేశారు. అనంతరం శాస్త్రవేత్త దుర్గాప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, సిబ్బంది పాల్గొన్నారు.

కలిసి పని చేద్దాం.. సజావుగా ఎన్నికలు జరిపిద్దాం

- ప్రశాంత ఎన్నికలకు అంతర్ రాష్ట్ర సమన్వయ సమావేశం
- హాజరైన మూడు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు
- కొటియా, ఇతర కీలక అంశాలపై చర్చ

సాక్షి, పార్వతీపురం మన్యం: పార్వతీపురం మన్యం, రాయగడ, కోరాపుట్ జిల్లాల్లో సార్వత్రిక ఎన్నికలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పరస్పర సమన్వయంతో వ్యవహరించాలని నిర్ణయించారు. మూడు జిల్లాల కలెక్టర్లు, పోలీస్ సూపరింటెండెంట్‌లతో గురువారం సమన్వయ సమావేశం వీడియో కాన్ఫరెన్స్‌లో నిర్వహించారు. పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంత్‌కుమార్ ఈ సమావేశాన్ని సమన్వయపరిచారు. మూడు జిల్లాల్లో ఒకే దశలో ఎన్నికలు నిర్వహిస్తుండటం.. ఒడిశా నుంచి అధికంగా మాదక ద్రవ్యాలు తరలి వచ్చే అవకాశం ఉండడం.. సరిహద్దు ప్రాంతాలు కావడంతో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రత్యేకించి మద్యం, రైలు-బస్సుల ద్వారా మాదకద్రవ్యాల రవాణాను అరికట్టడం, ఉచితాల పంపిణీని నియంత్రించడం, పోలింగ్ సిబ్బందికి వాహనాలు సమకూర్చడం, పోలింగ్ సిబ్బందిని కేంద్రాలకు తరలించడం వంటి అంశాలపై ఏకాభిప్రాయానికి వచ్చారు.

కొటియా గ్రామాల్లో ఓటర్లను ఎవరూ అడ్డుకోవద్దు...

ప్రధానంగా ఆంధ్రా-ఒడిశా సరిహద్దు వివాదాస్పద గ్రామాలైన కొటియా ప్రాంతాల్లో ఎన్నికలపై చర్చకు వచ్చింది. దీనిపై పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ మాట్లాడుతూ.. ఓటర్లు స్వేచ్ఛగా, స్వచ్ఛందంగా ఓటు వేయడానికి అవకాశం కల్పించాలని స్పష్టం చేశారు. ఓటు వేయకుండా అడ్డుకోరాదని తెలిపారు. సున్నితమైన అంశం న్యాయపరమైన పరిధిలో ఉందన్న విషయాన్ని గుర్తు చేస్తూ.. జిల్లా యంత్రాంగాలు ఓటర్ల స్వేచ్ఛకు భంగం కలిగించరాదని కోరారు. ఓటర్లు తమ ఇష్టానుసారం ఓటు వేస్తారని, ఇది ఎప్పటి నుంచో ఆనవాయితీగా వస్తోందని చెప్పారు. 'మా జిల్లా యంత్రాంగం ఓటర్లను అడ్డుకోద్దు. మీ జిల్లా యంత్రాంగం ఓటర్లను అడ్డుకోవద్ద''ని స్పష్టం చేయగా.. అందుకు కోరాపుట్ జిల్లా యంత్రాంగం సహకరించేందుకు అంగీకరించింది. 22 గ్రామాలకు నాలుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఈ జాబితాను కోరాపుట్ జిల్లాకు పంపుతామని కలెక్టర్ తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా మీదుగా వెళ్లే పోలింగ్ సిబ్బందికి ఎలాంటి ఆటంకమూ కలగదని రాయగడ జిల్లా కలెక్టర్ అభ్యర్థన మేరకు ఆయన వెల్లడించారు. కోరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తి వాసన్ మాట్లాడుతూ ప్రశాంతంగా, సజావుగా ఎన్నికల నిర్వహణ కోసం అన్ని అంశాలలో సమన్వయం చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కొటియా ప్రాంతంలో ఎనిమిది పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, అందులో రెండు కేంద్రాలు సరిహద్దుకు సమీపంలో ఉన్నాయని చెప్పారు. ఈ గ్రామాల్లో ఓటర్లకు తమ జిల్లా యంత్రాంగం తరఫున పూర్తి భరోసా ఇచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

సమన్వయంతో చెక్‌పోస్టుల నిర్వహణ

మన్యం పోలీస్ సూపరింటెండెంట్ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ సరిహద్దుల వద్ద చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని, సమన్వయం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాయగడ జిల్లా కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ మాట్లాడుతూ కొంతమంది పోలింగ్ సిబ్బంది కొమరాడ మండలం మీదుగా పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాల్సి ఉందని, ఈ తరుణంలో సహకరించాలని కోరారు. రాయగడ పోలీస్ సూపరింటెండెంట్ హరీష్ బిసి, కోరాపుట్ పోలీసు అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

వెంకటరాజపురం పరిసరాల్లో ఏనుగుల గుంపు

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు, వెంకటరాజపురం, బట్లబద్ర పరిసర ప్రాంతాల్లో ఏనుగుల గుంపు బుధవారం సంచరించింది. పామాయిల్, అరటి, వరి పొలాల్లో తిరుగుతూ పంటలను ధ్వంసం చేశాయి. రాత్రి సమయాన పంట పొలాలకు వెళ్లే రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అటవీశాఖ సిబ్బంది కోరారు.

ఇంటర్మీడియట్ విద్యార్థి ఆత్మహత్య

పార్వతీపురంటౌన్: పట్టణంలోని కోడిగుడ్లవీధికి చెందిన విద్యార్థి మాడెం శ్రేయస్ (17) వేదాంత జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పూర్తి చేశాడు. చదువులో రాణించలేకపోతున్నానని, ఇంటికి మంచి పేరు తీసుకురాలేక పోతున్నానని మనస్తాపం చెంది గురువారం ఇంట్లో ఎవరూ లేనప్పుడు ఐరన్ రాడ్డుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనపై కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై సంతోషి కుమారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహానికి జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.

కోడ్ ఉల్లంఘిస్తే కేసుల నమోదు

- కలెక్టర్ నాగలక్ష్మి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: క్షేత్రస్థాయిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. కోడ్ ఉల్లంఘనపై దృష్టి పెట్టి కేసులు నమోదు చేయాలని సూచించారు. నిర్లిప్తతను విడనాడాలని, ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కోడ్ అమల్లోకి వచ్చి ఇప్పటికే 72 గంటలు గడువు దాటిపోయిందని, నిబంధనలను అమలు చేయనివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పోలీస్ అధికారులు, ఎంసీసీ బృందాలు, ఇతర ఎన్నికల సిబ్బందితో కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ ఎం.దీపిక గురువారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల నిర్వహణకు పరస్పరం సమన్వయంతో మరింత క్రియాశీలంగా వ్యవహరించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో కోడ్ ఉల్లంఘన ఘటనలకు స్థానిక అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఎంసీసీ, ఎన్నికలకు సంబంధించిన అన్ని రకాల బృందాలు సంబంధిత ఆర్ఓ కిందనే పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. ఎన్నికలకు సంబంధించి సువిధ వెబ్‌సైట్, యాప్‌ల ద్వారా మాత్రమే 19 రకాల అనుమతులు జారీ చేస్తామన్నారు. ఇంటింటి ప్రచారానికి కూడా అనుమతి ఉండాలని స్పష్టం చేశారు. ఇళ్లలో బ్యానర్లు, స్టిక్కర్లు పెట్టాలంటే, ఆ ఇంటి యజమాని నుంచి అనుమతి ఉండాలని, ప్రచారం కోసం ప్రత్యేకంగా తయారు చేయించిన వాహనాలకు ఆర్టీఓ నుంచి ఫిట్‌నెస్ ప్రస్తుతం జరిగే ప్రచార ఖర్చులు పార్టీ ఖాతాలోకి వెళ్లాయని, నామినేషన్ వేసిన తరువాత చేసే ఖర్చు అభ్యర్థి ఖాతాలో లెక్కిస్తారని తెలిపారు. ప్రభుత్వం నుంచి జీతం, వేతనం, లేదా గౌరవ భృతి తీసుకొనే ప్రతి ఒక్కరికీ నియమావళి వర్తిస్తుందని స్పష్టంచేశారు. వారంతా రాజకీయ పార్టీ ప్రచారాల్లో పాల్గొనకూడదన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, ఇతర ఉద్యోగులను పూర్తిగా విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. అనుమతులు లేని కార్యక్రమాలను, ఎంసీసీ ఉల్లంఘనలను ఫొటోలు, వీడియోలు తీసి, కేసు నమోదు చేయాలని ఎస్పీ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ బి.వెంకట త్రివినాగ్, డీఆర్ఓ ఎస్.డి.అనిత, నోడల్ ఆఫీసర్లు, పోలీసులు అధికారులు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

జనసేన కార్యకర్తపై కేసు

భోగాపురం: ఓటర్లకు జనసేన ఎర నివేదికపై ఉన్నతాధికారులు ఆరా తీశారు. నెల్లిమర్ల నియోజకవర్గం జనసేన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్, చీరలు, బకెట్లు పంపిణీ చేస్తూ ఓటర్లకు ఎరవేస్తున్నారు. ఎన్నికల నిబంధనలకు పాతరేస్తున్నారంటూ బుధవారం సాక్షిలో ప్రచురితమైన ఓటర్లకు జనసేన ఎర కథనంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. సాక్షిలో ప్రచురితమైన కథనంపై పూర్తి నివేదిక అందజేయాలంటూ రిటర్నింగ్ అధికారితో పాటు మండల ఎంసీసీ అధికారులను ఆదేశించారు. దీంతో ఎంసీసీ అధికారులు ఎంపీడీఓ చంద్రకళ, ఎస్సై సూర్యకుమారి లైన్ స్క్వాడ్ సిబ్బందితో కలిసి విచారణ చేపట్టారు. ఈ మేరకు సాక్షి వార్తలో పబ్లిష్ అయిన ఫొటోల ఆధారంగా ఎంక్వయిరీ చేయడంతో ఎన్నికల కోడ్ అమలులో ఉండగా జనసేన కార్యకర్త కాగితాల చిన్న ఓటర్లకు ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్, చీరలు, బకెట్లు పంపిణీ చేసినట్లు విచారణలో తేలింది. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై సూర్యకుమారి తెలిపారు.

పైడితల్లమ్మవారి కానుకల వేలం పాట



వేలం పాట నిర్వహిస్తున్న పైడితల్లి ఆలయం ఈఓ డీవీవీ ప్రసాదరావు

విజయనగరం టౌన్: శ్రీ పైడితల్లి అమ్మవారికి భక్తులు సమర్పించే చీరలు, జాకెట్ ముక్కలు, ఇత్తడి సామగ్రికి సంబంధించి ఆలయ ఈఓ డీవీవీ.ప్రసాదరావు నేతృత్వంలో గురువారం శివాలయం వీధిలో ఉన్న కార్యాలయం ఆవరణలో వేలంపాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ చీరలు, జాకెట్ ముక్కలు తీసుకునేందుకు రూ. 22 లక్షల 65 వేలు, అమ్మవారికి వచ్చిన ఇత్తడి సామగ్రికి రూ.72వేలు, కొబ్బరి చెక్కల వేలం పాట రూ.17 లక్షల 50వేలకు వెళ్లిందని చెప్పారు. అలాగే దత్తాలయమైన వెంకటేశ్వరస్వామి ఆలయానికి వచ్చిన కొబ్బరిముక్కలు రూ.లక్షా 15వేల 500 వేలానికి వెళ్లినట్లు చెప్పారు. అదేవిధంగా అమ్మవారి ప్రసాదాలైన లడ్డూ, పులిహోరలను తయారుచేసేందుకు అవసరమైన ప్రావిజెన్స్ సరఫరాకు డీసీఎంఎస్ తక్కువగా కోట్ చేసినట్లు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ కొనసాగిన వేలం పాటలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజకుమారి, సిబ్బంది, సుమారు 25 మంది పాటదారులు పాల్గొన్నారు.

సి-విజిల్ యాప్ ఫిర్యాదులపై చర్యలు

- కలెక్టర్ నిషాంత్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: ఎన్నికల నియమావళికి సంబంధించి సి-విజిల్ యాప్‌లో వచ్చే ఫిర్యాదులపై తక్షణం చర్యలు తీసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంత్‌కుమార్ రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల ఏర్పాట్లపై రిటర్నింగ్ అధికారులతో కలెక్టర్ నిషాంత్‌కుమార్ గురువారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పౌరులు కోడ్ ఉల్లంఘనకు సంబంధించి ఏవైనా గుర్తించి సి-విజిల్ యాప్‌లో ఫిర్యాదులను నమోదు చేయవచ్చని చెప్పారు. నమోదు చేసిన 100 నిమిషాల్లో స్పందించి ఫిర్యాదుపై తీసుకున్న చర్యల గురించి ఫిర్యాదు దారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. సి-విజిల్ యాప్‌లో వచ్చిన ఫిర్యాదులపై పర్యవేక్షణ ఉంటుందని, వాటి పరిష్కారంలో నిబద్ధతతో పనిచేయాలని స్పష్టం చేశారు. కంట్రోల్ కేంద్రాలు నిరంతరం పనిచేయాలని, రాత్రి సమయాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని హితవు పలికారు. ఫిర్యాదు అందిన వెంటనే తనిఖీ బృందాలు సంఘటనా స్థలానికి వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. పెండింగ్ ఫారాలను వెంటనే పరిష్కరించాలని, షెడ్యూల్ విడుదల చేసిన పది రోజుల తరువాత ఫారాలపై చర్యలు తీసుకునే అవకాశం ఉండదని చెప్పారు. ఎన్నికలకు సంబంధించి శిక్షణ ఇచ్చేందుకు, ఎన్నికల సామగ్రి తరలింపు, స్ట్రాంగ్ రూమ్, రవాణా, భద్రత, పంపిణీ ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాలకొండ రిటర్నింగ్ అధికారి(సీతంపేట ఐటీడీఏ పీఓ) కల్పనా కుమారి, సాలూరు రిటర్నింగ్ అధికారి (పార్వతీపురం ఐటీడీఏ పీఓ) సి.విష్ణుచరణ్, ఇన్‌చార్జ్ డీఆర్ఓ జి.కేశవనాయుడు, డిప్యూటీ కలెక్టర్ ఆర్‌వీ.సూర్యనారాయణ, పార్వతీపురం రిటర్నింగ్ అధికారి,(పార్వతీపురం ఆర్డీఓ) కె.హేమలత, కురుపాం రిటర్నింగ్ అధికారి (పాలకొండ ఆర్డీఓ) ఏవీ.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన డిప్యూటీ తహసీల్దార్



ఏసీబీ అధికారులకు చిక్కిన డీటీ కె.శ్రీనివాసరావు

విజయనగరం క్రైమ్: కార్పొరేషన్ పరిధిలో ఉన్న ఎమ్మార్వో కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న కె.శ్రీనివాసరావు గురువారం కార్యాలయంలోనే రూ.పదివేలు లంచం తీసుకుంటూ ఏసీబీ వలకు చిక్కారు. ఈ మేరకు ఏసీబీ డీఎస్పీ రామచంద్రరావు గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన జాగిలంక శివరామ్ ప్రసాద్, ఆయన బావకు సంబంధించిన 150, 267 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఖాళీ ప్లాట్‌ల సర్వే నంబర్ల సవరణకు సంబంధించి ఎండార్స్‌మెంట్ జారీచేసేందుకు డీటీ కె.శ్రీనివాసరావు రూ.15వేలు లంచం డిమాండ్ చేశారు. లంచం ఇచ్చేందుకు బాధితులకు ఇష్టం లేకపోవడంతో ఏసీబీని ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదుచేసిన ఏసీబీ అధికారులు డిప్యూటీ తహసీల్దార్ కార్యాలయం గదిలో బాధితుల నుంచి రూ.10వేలు లంచం తీసుకుంటుండగా డీటీని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందిత అధికారిని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరుస్తామని డీఎస్పీ తెలిపారు. అవినీతి అధికారులపై ప్రజల ఫిర్యాదుల కోసం ఫోన్ 14400 నంబర్ ప్రత్యేకంగా అందుబాటులో ఉంచామని, ఎవరైనా అధికారులు వేధింపులకు పాల్పడితే ప్రజలు ఈ నంబర్ ద్వారా ఏసీబీ అధికారులను సంప్రదించాలని కోరారు.

నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగం

- విజిలెన్స్ దర్యాప్తుతో వెలుగులోకి విషయం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్

బొబ్బిలి: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఏటీఓగా విధులు నిర్వహించిన మెట్ట సిద్ధార్థ నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగం పొందాడనే ఫిర్యాదుపై పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. స్థానికంగా వినిపిస్తున్న అంశాల ప్రకారం ఉపాధి శిక్షణ శాఖలోని ఓ ఉన్నతోద్యోగి జోన్-1లో పనిచేస్తున్న డీటీఓను అకారణంగా తొలగించారు. దీనిపై ఆయన కోర్టుకు వెళ్లారు. తన తప్పిదాన్ని తెలుసుకున్న ఉన్నతోద్యోగి బాధితుడితో రాజీ కుదుర్చుకుని నడిపి అతని కుమారుడికి ఉద్యోగం ఇప్పిస్తానని హామీ ఇచ్చి కేసు రాజీ చేయించుకున్నారు. ఈ నేపథ్యంలోనే అతని కుమారుడికి ఏటీఓగా బొబ్బిలిలో ఉద్యోగమిచ్చారు. అయితే ఈ విషయమై వచ్చిన ఫిర్యాదుల మేరకు విజిలెన్స్ కమిటీ విచారణ చేపట్టి నివేదిక ఇచ్చింది. సర్టిఫికెట్ల విషయమై విజయనగరం ప్రిన్సిపాల్ విచారణ జరిపి నకిలీవంటూ నివేదించారు. సదరు ఉద్యోగి ఇంటర్మీడియట్, ఐటీఐ ఒకే సంవత్సరంలో సర్టిఫికెట్లు పొందినట్లు, పైగా ఇంజినీరింగ్ సర్టిఫికెట్ నకిలీదని విచారణ అధికారులు తేల్చారు. దీంతో ఆ శాఖ డైరెక్టర్ నవ్య సంబంధిత ఉద్యోగి సిద్ధార్థను టెర్మినేట్ చేయాలని ఇక్కడి ప్రిన్సిపాల్ జీవీ రమణకు ఒరిజినల్ ఆదేశాలను పంపించారు. అంతే కాకుండా అతనిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కూడా ఆదేశించారు. దీంతో ప్రిన్సిపాల్ జీవీ రమణ స్థానిక సీఐ ఎం.నాగేశ్వర రావుకు ఫిర్యాదు చేయగా విజిలెన్స్ రిపోర్టు, నకిలీ సర్టిఫికెట్లపై విచారణ రిపోర్టు తదితర పూర్తి వివరాలను సమర్పించాలని సూచించారు. దీంతో మరికొన్ని పత్రాల కోసం ఎదురు చూస్తున్నట్టు ప్రిన్సిపాల్ రమణ విలేకరులకు గురువారం తెలిపారు. ఈ విషయమై సీఐ ఎం నాగేశ్వరరావును వివరణ కోరగా క్రిమినల్ చర్యల కోసం స్టేషన్‌కు ప్రిన్సిపాల్ వచ్చారని పూర్తి స్థాయి పత్రాలు సబ్‌మిట్ చేయాలని చెప్పామని, వాటి కోసం ఎదురు చూస్తున్నట్లు వివరించారు.

ఉత్తరాంధ్ర స్థాయి వాలీబాల్ పోటీల ప్రారంభం



ఉత్తరాంధ్ర స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

తెర్లాం: మండలంలోని విజయరాంపురం గ్రామంలో ఉత్తరాంధ్ర స్థాయి వాలీబాల్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీ గణపతి ఆలయ ప్రతిష్ఠ సందర్భంగా ఆలయ నిర్వాహకులు వివిధ రకాల పోటీలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఉత్తరాంధ్ర స్థాయి వాలీబాల్ పోటీలను ఆలయ ధర్మకర్త బూరి శ్రీనివాసరావు, సర్పంచ్ బూరి మధుసూదనరావు, మాజీ సర్పంచ్ అప్పలనాయుడు ప్రారంభించారు. ఈ పోటీల్లో పలు గ్రామాల నుంచి 38వాలీబాల్ జట్లు పాల్గొన్నాయి.

పోటీల్లో ప్రథమవిజేత జట్టుకు రూ.20వేలు, ద్వితీయ స్థానం సాధించిన జట్టుకు రూ.15వేలు, తృతీయ స్థానం సాధించిన జట్టుకు రూ.10వేలు నగదు బహుమతిని అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఏజెన్సీ కేంద్రంగా పశువుల అక్రమ రవాణా



కురుపాం మీదుగా ఓ వాహనంలో పశువులను కుక్కి తరలిస్తున్న దృశ్యం

కురుపాం: కురుపాం ఏజెన్సీ కేంద్రంగా ప్రతి బుధ, గురువారాల్లో పశువుల అక్రమ రవాణా మ్యాక్సీపికప్ వ్యాన్‌లు, లారీల్లో యథేచ్ఛగా జరిగిపోతోంది. గుమ్మలక్ష్మీపురం మండలంలోని కేదారిపురం వరకు ఒడిశా నుంచి పశువులను తీసుకు వస్తుండగా అక్కడినుంచి ఆంధ్రప్రదేశ్‌లోని పెద్ద వారపు సంతలైన మానాపురం, పార్వతీపురం ప్రాంతాలకు వాహనాల్లో తరలిస్తున్నారు. సంతల నుంచి మైదాన ప్రాంతాల్లోని కబేళాలకు పశువులు తరలిపోతున్నాయి. వాహనాల్లో మూగజీవాలను కుక్కి తరలిస్తుండడంతో పర్యవేక్షణ లేని అధికారుల తీరుపై జంతుప్రేమికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా పశువుల అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తులు అధికారులకు అధిక మొత్తంలో ముట్టచెబుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీని వల్లనే అధికారులు చూసీచూడనట్లు పశువుల వాహనాలను విడిచి పెట్టేస్తున్నట్లు అంతా చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు మూగజీవాల అక్రమ రవాణాపై దృష్టి సారించి అడ్డుకోవాలని కోరుతున్నారు.

ట్యాంకులో జారిపడి బాలుడి మృతి



బాలుడు సిద్ధు మృతదేహం

భోగాపురం: మండలంలోని దిబ్బలపాలెం సమీపంలో ఉన్న ప్రైవేట్ లే అవుట్‌లో గల వాటర్ ట్యాంకులో జారిపడి ఓ బాలుడు మృతి చెందాడు. బుధవారం సాయంత్రం జరిగిన ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జిల్లాలోని బొబ్బిలి గ్రామానికి చెందిన దాసరి నరసింహారావు, సుధ దంపతులు బతుకు తెరువు కోసం కూలి పనులు చేసుకునేందుకు మూడురోజుల కిందట దిబ్బలపాలెం గ్రామానికి వచ్చి సమీపంలో ఉన్న ప్రైవేట్ లేఅవుట్‌లో చేరి పనులు చేసుకుంటూ అక్కడే తోటి కూలీలతో కలిసి నివాసముంటున్నారు. వారికి కుమారుడు సిద్ధు(7) ఉన్నాడు. అయితే లేఅవుట్‌లోని కూలీలు స్నానాలు చేసుకునేందుకు లేఅవుట్ వారు అక్కడే ఒక వాటర్ ట్యాంకును ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం సిద్ధు తన తోటి పిల్లలతో కలిసి ట్యాంకు వద్ద స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు అందులో జారిపడిపోయాడు. ఇంతలో పక్కనే ఉన్న తోటి పిల్లలు కేకలు వేయడంతో సమీపంలో ఉన్న సెక్యూరిటీ గార్డు బైరెడ్డి అప్పలస్వామి ట్యాంకులోకి దిగి బాలుడిని పైకి తీసి హుటాహుటిన సుందరపేట ఆస్పత్రికి తరలించారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. స్థానికుల ద్వారా ఈ సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకుని విచారణ చేపట్టారు. బాలుడు తండ్రి నరసింహారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తాతారావు తెలిపారు.

ఫ్యాన్ గాలి కోసం



ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరిన షికారుగంజి, ఎస్టీ వలస గ్రామస్తులు

- వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీలో చేరిన 230 కుటుంబాలు
- ఆహ్వానించిన ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: కొన్నేళ్లుగా తెలుగుదేశం పార్టీలో ఉంటూ ఎటువంటి పథకాలు అందకుండా, చేసిన సేవలకు కూడా కనీసం గుర్తింపు లేక పోవడంతో అన్ని విధాలా నష్టపోయామని దత్తిరాజేరు మండలంలోని షికారుగంజి టీడీపీ సీనియర్ నాయకుడు చెల్లూరి వెంకటరావు అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన 230 కుటుంబాలతో వచ్చి గజపతినగరం మండల కేంద్రంలోని బెల్లాన కన్వెన్షన్ హాల్‌లో స్థానిక ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య చేతుల మీదుగా వైఎస్సార్‌సీపీ కండువాలను వేసుకుని పార్టీలో చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో గజపతినగరం నియోజకవర్గం ఎమ్మెల్యేగా బొత్స అప్పలనరసయ్యను, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించేందుకు శాయశక్తులా తమ 230 కుటుంబాల సభ్యులమంతా కలిసికట్టుగా కష్టపడి పని చేస్తామని స్పష్టం చేశారు. వెంకటరావుతో పాటు పార్టీలో చేరిన వారిలో సీనియర్ టీడీపీ నాయకులు నేరడబిల్లి పైడితల్లి, శనపతి ఈశ్వరరావు, రాంబార్కి గోపి, రాంబార్కి ఆదినారాయణ, రాంబార్కి శేఖర్, బొడ్డలి సత్యనారాయణ, మొక్క లక్ష్మణరావు, గంటా నారాయణ రావు, రాంబార్కి దాలినాయుడు, రాంబార్కి సత్యనారాయణ, గేదెల పైడన్న తదితరులున్నారు. షికారు గంజి గ్రామం నుంచి 140 కుటుంబాలు, ఎస్టీ వలస నుంచి 90కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు వెంకటరావు ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణ రాజు (సురేష్ బాబు), జగ్గినేని రామారావులతో పాటు దత్తిరాజేరు జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, ఎంపీపీ సింహాద్రి అప్పలనాయుడు, దత్తిరాజేరు మండలం వైఎస్సార్‌సీపీ సీనియర్ నేతలు మంత్రి అప్పలనాయుడు, రమేష్, గడసాం రమణ పాల్గొన్నారు.

టీడీపీకి షాక్

రేగిడి: మండలంలో తునివాడ గ్రామంలో టీడీపీకి షాక్ తగిలింది. గురవాం గ్రామంలో టీడీపీకి చెందిన 25 కుటుంబాల వారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో గురువారం చేరారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు కేవీ సూర్యనారాయణరాజులు పార్టీలో చేరిన వారిని కండువాలు వేసి ఆహ్వానించారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి పార్టీలకు అతీతంగా అన్ని సంక్షేమ పథకాలు అందించి ప్రజలకు మంచి చేస్తున్నారనే అభిప్రాయంతోనే తామంతా టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నామని గేదెల పోలినాయుడు, సంచాన మహేష్, ఐడాల చంద్రయ్య, మంతిరెడ్డి గణపతి, మహేష్, నారాయణరావు, అప్పలనాయుడు, పెంటన్నాయుడు, లక్ష్మీనారాయణ, బంగారినాయుడు, ఉమామహేశ్వరరావు, భాస్కరరావు తదితరులు వెల్లడించారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు, జేసీఎస్ కన్వీనర్ కింజరాపు సురేష్, స్థానిక ఎంపీటీసీ వంజరాపు శ్రీనివాసరావు, న్యాయవాది వంజరాపు సుదర్శనరావు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు వంజరాపు వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.